
సాక్షి
తిరుపతి
సోమవారం ; 9 ; డిసెంబర్ ; 2024



కలెక్షన్ కిక్!

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీతో పట్టణాలు, పల్లెల్లో మద్యం ఏరులై ప్రవహిస్తోంది. - 8లో



సమానత్వమే అన్నమయ్య ఆకాంక్ష

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి చేపట్టిన తిరుమల మహాపాదయాత్ర రేణిగుంట మండలానికి చేరింది. - 8లో



ముక్కంటి.. కనవేంటి!

ముక్కంటి ఆలయంలో బ్యాటరీ వాహనాలు తిరగడం లేదు. స్వామివారి దర్శనానికి వచ్చే వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పరుగుల రాణికి ప్రశంసల జల్లు



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని

వరదయ్యపాళెం: రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థినికి ఆదివారం సత్యవేడు ఎంఈఓ రవి ప్రశంసాపత్రం అందించారు. అంబేద్కర్ బాలికల గురుకుల వసతి గృహంలో ఇంటర్ సెకెండియర్ విద్యార్థిని మయూరి స్పందన పాల్ ఇటీవల వైఎస్సార్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ మేరకు విద్యార్థినికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్న పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలు అవసరం



మాట్లాడుతున్న సింహపురి వర్సిటీ వీసీ విజయ్ భాస్కర్

తిరుపతి సిటీ : డిజిటల్ గ్రంథాలయాలు విద్యార్థులకు అవసరమని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకోవాలని విక్రమ సింహపురి వర్సిటీ వీసీ విజయ్‌భాస్కర్ సూచించారు. ఎస్వీయూలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెంపుల్–2024 జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు దీటుగా నిలబడాలంటే గ్రంథాలయ వ్యవస్థకు సాంకేతికతను జోడించాలని కోరారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా విద్యార్థులకు చేరువ చేయవచ్చని తెలిపారు. వర్సిటీలో చక్కగా సదస్సు నిర్వహించిన గ్రంథాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబును అభినందించారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, డాక్టర్ కిషోర్, డాక్టర్ రంగనాథ్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

చిల్లకూరు : హ్యాండ్ బాల్ జిల్లా జట్టును ఆదివారం చిల్లకూరు గురుకుల పాఠశాలలో ఎంపిక చేశారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎంపికకు సూళ్లూరుపేట, కావలి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, వెంకటగిరి మండలాలకు చెందిన సుమారు 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 16 మంది జట్టుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత పీడీ జానకిరామ్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

వి రన్ ఫర్ తిరుపతి



జెండా ఊపి రన్ ప్రారంభిస్తున్న అధికారులు



మెడల్ బహూకరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), యాంటీ నార్కోటిక్స్ విభాగం, ఎస్వీయూ ఎన్‌ఎస్‌ఎస్, వీ వైబ్ సంస్థ ఆదివారం నిర్వహించిన వి రన్ ఫర్ తిరుపతి కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్వీయూ తారకరామా స్టేడియం నుంచి చెర్లోపల్లె క్రాస్ వరకు సాగిన 10 కే రన్, 5కే రన్, 3కే రన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు, శాప్ చైర్మన్, వీసీ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో మెలగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక, విద్యా, సాంస్కృతిక, క్రీడా రాజధానిగా నిలుస్తుందన్నారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ క్రమంలోనే బిగ్ బాస్ ఫ్రేమ్ కిరాక్ సీత, నేహా చౌదరి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈగల్ ఎస్పీ నగేష్, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, నిర్వాహకులు సజ్జ రాగవీణ అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ వెంకట్ నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు. – తిరుపతి సిటీ/ఎడ్యుకేషన్



రన్‌కు హాజరైన యువత

కొనలేం.. తినలేం!

చుక్కలనంటిన కూరగాయలను చూసేందుకు కూడా సామాన్యుడు భయపడుతున్నాడు. కాగుతున్న నూనె ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నాడు. ఉల్లి.. వెల్లులి మాట వినపడితేనే ఉలిక్కిపడుతున్నాడు. చివరకు ఆకుకూరలను అందుకునేందుకు కూడా జేబులు సరిచేసుకుంటున్నాడు. కనీసం కోడిగుడ్లు తెచ్చుకునేందుకు సైతం ఒకటికి పది పర్యాయాలు ఆలోచిస్తున్నాడు. ఇక చికెన్.. మటన్ సంగతి సరేసరి.. ఊహలోకి వస్తే కూడా హడలిపోతున్నాడు. ఏది ఏమైనా నిత్యావసరాలను కొనుగోలు చేయలేక నలిగిపోతున్నాడు. నిత్యం పైకి చూస్తున్న ధరలను చూసి ఆందోళన చెందుతున్నాడు. పౌష్టికాహారానికి దూరమై దిగాలుపడుతున్నాడు.



- సామాన్యుడికి ధరాఘాతం
- మండుతున్న కూరగాయలు
- ఆకాశాన్నంటిన నిత్యావసర సరుకుల రేట్లు
- ఘాటెక్కిన ఉల్లి.. వెల్లుల్లి
- కొండెక్కిన కోడిగుడ్లు
- పేదలకు దూరమైన పౌష్టికాహారం

తిరుపతి గాంధీ రోడ్ : నిత్యావసర సరుకులు.. కూరగాయలు.. చికెన్..గుడ్లు... ఇలా ఏం కొనాలన్నా పెరిగిన ధరలకు వినియోగదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. మార్కెట్‌లో ఈ రోజు ఉన్న రేటు మరుసటి రోజు ఉండడం లేదు. బియ్యం, పప్పు దినుసులు, నూనె, కారం తదితర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధాన్యం ధర పడిపోయినప్పటికీ బియ్యం ధర తగ్గడం లేదు. ఇక ఉల్లి, వెల్లుల్లి వైపు చూడడానికి కూడా జంకే పరిస్థితి. గతంలో ఎన్నడూ లేని విధంగా వెల్లుల్లి కిలో రూ.420 పైగానే పలుకుతోంది. కొన్ని నెలల క్రితం రూ.230 నుంచి రూ.240 వరకు పెరిగిన చికెన్ అంతకు మించి తగ్గనంటోంది. ఇక కూరగాయల ధరలు కూడా మంట పుట్టిస్తున్నాయి. దీంతో రూ.500లతో మార్కెట్‌కు వెళ్లినా సంచి నిండని దుస్థితి దాపురించింది.

కొనుగోలుకు వెనుకంజ

అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుడు కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నాడు. దీంతో వ్యాపారాలు కూడా పడిపోయినట్లు దుకాణదారులు వాపోతున్నారు. కూరగాయల్లో ఏది కొనుగోలు చేయాలన్నా రూ.40 నుంచి రూ.100 వరకు చేరింది. కంది పప్పు కిలో రూ.180 నుంచి రూ.190, శనగపప్పు రూ.95 నుంచి రూ.100, నూనె రూ.135 నుంచి రూ.165 వరకు పలుకుతోంది.

'ఎగ్'బాకుతోంది!

కోడి గుడ్ల ధరలు నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. ఏరోజు ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. నెల క్రితం 30 గుడ్ల ధర రూ.140 నుంచి రూ.150 వరకు ఉంది. ఇప్పుడు వంద గుడ్ల ధర రూ.700లకు చేరింది. ప్రస్తుతం జిల్లాకు పలు ప్రాంతాల నుంచి నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో మరింత పెరిగే అవకాశముందని పౌల్ట్రీ వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

ధరల సమాచారం

కూరగాయ	కేజీ ధర (రూ.లో)
మునక్కాయలు	400
వంకాయలు	30
తెల్ల వంకాయలు	50
బెండకాయలు	40
దొండకాయలు	30
క్యారెట్	60
బీట్‌రూట్	60
పచ్చిమిర్చి	30
కొత్తిమీర కట్ట	30
కరివేపాకు	50
పుదీనా కట్ట	20
ఎర్రగడ్డలు	70
తెల్లగడ్డలు	400
చామగడ్డ	50
క్యాబేజీ	40
కాలీఫ్లవర్	25
బీన్స్	50
కాప్సికం	50
అల్లం	60
ముల్లంగి	60
టమాట	50
ఉర్లగడ్డ	40



తిరుపతి మార్కెట్‌లో కూరగాయల విక్రయం

వర్షాలే కారణం



కూరగాయల ధరలు ఈ స్థాయిలో పెరిగేందుకు ఇటీవల కురిసిన భారీ వర్షాలే ప్రధాన కారణం. పంటలు దెబ్బతినడంతో ఉత్పత్తులు తక్కువగా మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో డిమాండ్ పెరిగి రేట్లు ఆకాశానికి చేరాయి. మరో నెల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముంది. వాతావరణం అనుకూలిస్తే ధరలు తగ్గవచ్చు. ప్రజలకు అందుబాటులోకి రావచ్చు.

– సతీష్, కూరగాయల వ్యాపారి

ఇబ్బందిగా ఉంది



ప్రస్తుతం అన్ని రకాల నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. ఆకుకూరలు, కూరగాయల నుంచి వంట సరుకులు కూడా ధరలు పెరిగిపోయాయి. దీంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం. ఏం కొనాలన్నా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సరుకుల ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. మాలాంటి పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి. ఇదే విధంగా ధరలు ఉంటే పూట గడవడం కూడా కష్టమే.

– ప్రభావతమ్మ, గృహిణి

వ్యాపారం కష్టంగా మారింది



పెరిగిన ధరలతో వ్యాపారం కష్టంగా మారింది. దీంతో నష్టపోవాల్సి వస్తుంది. మార్కెట్లో ఉల్లి, వెల్లుల్లితో పాటు వంట నూనెలు, పప్పు ధాన్యాలు వంటి ఇతర నిత్యావసర వస్తువుల ధరలన్నీ గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. వినియోగదారుల కొనుగోలు స్థాయి పూర్తిగా పడిపోయింది. అత్యవసరమైతేనే కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.

– గురవారెడ్డి, హోటల్ యజమాని

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులందరూ అందుబాటులో ఉండనున్నారు. ఈ క్రమంలోనే వివిధ సమస్యలపై వచ్చే అర్జీదారులకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. తాగునీటితోపాటు కుర్చీలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. వృద్ధులు ఇబ్బందిపడకుండా ముందుగా వారినే అధికారుల వద్దకు పంపించాల్సి ఉంది. అర్జీదారులకు వసతుల కల్పనపై కలెక్టర్, జేసీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ అధికారులు మాత్రం ఒక వారం ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వారం పట్టించుకోకుండా వదిలేస్తుండడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 13 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,569 మంది స్వామివారిని దర్శించుకోగా 28,193 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 13 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు మహిళా వర్సిటీలో ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ప్రాజెక్ట్ ఫెలో రిక్రూట్‌మెంట్ కోసం సోమవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌సీహెచ్‌ఈ–ఐబీసీ క్లస్టర్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వేస్టిగేటర్ ప్రొఫెసర్ డీఎం మమత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు వర్సిటీలోని సెరికల్చర్ విభాగానికి రావాలని కోరారు. ఇతర వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అధికారులతో ఢీఆర్సీ

- ఎమ్మెల్యేలంటే ఎందుకంత చిన్నచూపు
- జిల్లా అధికారులపై విరుచుకుపడిన కూటమి ఎమ్మెల్యేలు
- ప్రజా సమస్యలకంటే అధికారులపైనే టార్గెట్
- సభ్యుడు కాకున్నా జిల్లా స్థాయి సమీక్షలో చల్లా రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష (డీఆర్‌సీ) అధికారులపై టార్గెట్ సమావేశంగా మారింది. చిత్తూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. అజెండాలో 53 శాఖలకు సంబంధించిన అంశాలు చర్చించాల్సి ఉండగా 7 శాఖలపైనే చర్చించి మమ అనిపించారు.

అధికారులే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలను చర్చించాల్సిన కూటమి ప్రజాప్రతినిధులు అధికారులను టార్గెట్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వారిని కించపరుస్తూ మాట్లాడారు. ఇటీవల కుప్పం నియోజకవర్గంలోని అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్లకు చేపట్టిన శిక్షణ తరగతుల్లో అతిథిగా తనను ఆహ్వానించలేదంటూ సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డిపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మండిపడ్డారు. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్ సైతం జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచూపు చూస్తున్నారని, సిఫార్సు లెటర్లు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

నీరివ్వండి చాలు


ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సమీక్షలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ మాకొద్దు...నీరివ్వండి చాలు అన్నారు. ఇటీవల పాలసముద్రం మండలంలో ప్రజలు కలుషిత నీరు తాగి ఆస్పత్రుల పాలైనట్లు గుర్తుచేశారు.

గొప్పలు కొండంత

ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 12వ తేదీతో ఆరు నెలలు పూర్తవుతుందన్నారు. జిల్లాలోని కుప్పం, విజయపురం, పలమనేరు, చిత్తూరులో ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించకపోయినా నిర్మించినట్లు చెప్పారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 2,776 పశువుల షెడ్లకు అనుమతులు ఇచ్చి 50 షెడ్లను పూర్తి చేశామని పేర్కొన్నారు. పంట సంజీవని, కాలువల పనులు ఎక్కడా చేపట్టకపోయినా చేపట్టినట్లు తెలిపారు. ఇసుక పాలసీ విజయవంతమని గొప్పలు చెప్పుకున్నారు.

సభ్యుడుకాకున్నా సమావేశంలో..

ఎలాంటి అర్హత లేకున్నా పుంగనూరు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. దీంతో పలువురు అధికారులు ఆశ్చర్యపోయారు. అధికారులు ఆయనకు ఎమ్మెల్యేలతో సమానంగా మర్యాదలు చేశారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు సైతం సమావేశంలో పాల్గనడంపై విమర్శలు వెల్లువెత్తాయి.




ఎలాంటి అర్హత లేకున్నా సమీక్షలో పాల్గొన్న పుంగనూరు టీడీపీ నాయకుడు చల్లారామచంద్రారెడ్డి

సమీక్షలో చర్చించిన పలు అంశాలు..

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజనా నిధులను మూడు నెలల్లో ఎలా ఖర్చు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు.
- జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో పట్టు సాగు ఎక్కువగా ఉందన్నారు. మార్కెటింగ్ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. రీలింగ్ యూనిట్, షెడ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో షెడ్స్ ఏర్పాటుకు రూ.6.5 లక్షలు ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.3 లక్షలే ఇస్తున్నారని పేర్కొన్నారు.
- చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 20 వేల ఫిర్యాదులు అందాయన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 33 రోజుల పాటు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఇండో–ఇజ్రాయేల్ అనుబంధంగా రూ.10 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అపార్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి శాఖలో అమలయ్యే కార్యక్రమాల వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు.
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో నల్ల బెల్లంపై ఆంక్షలు విధించడంతో రైతులు చెరుకు సాగును మానేశారన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మురళీ మోహన్, కడా పీడీ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎఫ్‌వో భరణి పాల్గొన్నారు.

పడకేసిన పంచాయతీలు

- ఖాళీగా కార్యదర్శి పోస్టులు





తిరుపతి అర్బన్ : రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుతాం. ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. నిరుద్యోగ సమస్యలను తుడిచిపెట్టేస్తాం.. అలాగే సూపర్ సిక్స్ పేరుతో పథకాలు అందించి ప్రజా సంక్షేమానికి పట్టం కడతామని ఎన్నికల ముందు చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేశారు. ప్రధానంగా ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదు. పంచాయతీ పాలనలో కీలకమైన కారదర్శి పోస్టులు జిల్లాలో 184 ఖాళీగా ఉన్నా పట్టించుకున్న దాఖలా లేదు. దీంతో పెద్దసంఖ్యలో పంచాయతీలు పడకేశాయి.

సమస్యల వెల్లువ

గ్రామీణాభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం. ప్రధానంగా తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించడం తదితర అన్ని పనులను కార్యదర్శులు పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల సర్కార్ తూతూ మంత్రంగా విదిల్చిన ఆర్థిక సంఘం నిధులు కేవలం వీధిలైట్లు, విద్యుత్ చార్జీలకే సరిపోయింది. జిల్లాలోని 774 పంచాయతీల్లో 184 కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్క పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనిపై పలువురు కార్యదర్శులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తమ పంచాయతీల్లో పనులు చక్కబెట్టేందుకే తల ప్రాణం తోకకు వస్తుంటే, అదనపు బాధ్యతలు అప్పగిస్తే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా పల్లెసీమల్లో కార్యదర్శుల కొరత స్పష్టంగా కనిపిస్తోందని గ్రామీణులు వాపోతున్నారు. ఇప్పటికీ ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంపై మండిపడుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం



జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు 184 వరకు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి త్వరలో ప్రతిపాదనలు పంపుతాం. రెండు నెలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. అప్పటి వరకు పక్క పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. స్థానికంగా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సుశీలాదేవి, డీపీఓ

క్లుప్తంగా

11న ఐఐటీలో హ్యాకథాన్ ఫినాలే


తిరుపతి ఐఐటీ ప్రవేశద్వారం

రేణిగుంట(ఏర్పేడు): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2024 ప్రతిష్టాత్మక గ్రాండ్ ఫినాలేను తిరుపతి ఐఐటీలో ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నేతృత్వం వహించేందుకు విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాలలో తిరుపతి ఐఐటీ ఒకటి అని వెల్లడించారు. ఈ మేరకే ప్రాంగణంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గ్రాండ్ ఫినాలే పోటీలు చేపట్టనున్నట్లు వివరించారు. హ్యాకథాన్ 22 ఎలైట్ టీమ్‌లతో, దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగురు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులతో పోటీలు జరగనున్నాయన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమస్య ప్రకటనలకు పరిష్కారాలను రూపొందించేందుకు కఠినమైన పోటీలో పాల్గొంటారని తెలిపారు. ప్రతి సమస్య ప్రకటన విజేతలను కేంద్రప్రభుత్వం నగదు బహుమతులతో సత్కరిస్తుందని వెల్లడించారు. దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావం చూపే కొత్తతరం ఇంజినీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

కోట : మండలంలోని వెంకన్నపాళెంలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఎం.కోటయ్య(55) కుటుంబ కలహాల కారణంగా శివారు ప్రాంతంలోని మామిడితోటకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



స్టేషన్ పేరు	షాపుల సంఖ్య	ఐఎంఎల్ కేసెస్	బీరు కేసెస్	రూ.కోట్లల్లో
తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో...				
తిరుపతి అర్బన్	32	56,981	25281	47.98
తిరుపతి రూరల్	23	35,110	14028	27.98
శ్రీకాళహస్తి	30	45,649	10813	32.71
నాగలాపురం	22	25,723	7105	18.36
పుత్తూరు	17	24,017	8041	17.72
చంద్రగిరి	17	22,925	7749	17.09
మొత్తం	141	210,405	73017	161.80
గూడూరు సబ్ డివిజన్ పరిధిలో..				
గూడూరు	18	23017	5047	16.35
నాయుడుపేట	17	26359	7746	18.78
సూళ్లూరుపేట	21	32283	12016	24.40
వాకాడు	15	22462	4131-	14.36
వెంకటగిరి	15	21085	3380	14.36
మొత్తం	86	335611	105337	250.41
జిల్లా వ్యాప్తంగా	227	546016	178354	412.22

కలెక్షన్ కిక్!

- జిల్లాలో భారీగా మద్యం ప్రవాహం
- కొత్త విధానంతో విచ్చలవిడి అమ్మకాలు
- 45 రోజుల్లో రూ.412.22 కోట్ల విక్రయాలు
- 227 మద్యం షాపులు, బార్లలో మద్యం ఏరులు
- 1,800 బెల్ట్ షాపుల ఏర్పాటు



తిరుపతి క్రైమ్: కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త మద్యం పాలసీతో అధికారిక షాపులు, బెల్ట్ షాపుల ఏర్పాటుతో ఊరూవాడా మద్యం ఏరులై పారుతోంది. వ్యాపారులకు కలెక్షన్ కిక్ ఇస్తోంది. ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు కానీ.. లిక్కర్‌ను మాత్రం మందుబాబుల చెంతకు చేర్చింది. ప్రభుత్వ నిర్ణయంతో మద్యం ప్రియులు తెగ తాగేస్తుండడంతో వ్యాపారులకు కాసుల పంట పండుతోంది. మరోవైపు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం తెచ్చిపెడుతోంది. సంపద సృష్టిస్తామని గత ఎన్నికల ముందు పదేపదే చెప్పిన కూటమి నేతలు.. ఈ తరహాలో జనం జేబులో నుంచి సొమ్ము తీసుకొని ఖజానా నింపుకుంటు న్నారా? అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

1,800 పైగా బెల్ట్ షాపులు

తిరుపతి జిల్లాలో అధికారికంగా మద్యం దుకాణాలు 227 ఉండగా.. సుమారు 1,800కు పైగా బెల్ట్ షాపులు ఏర్పాటైనట్టు సమాచారం. ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులతో ప్రజలు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ అధికార పార్టీ నేతలకు చెందినవే కావడంతో ఎక్సైజ్ శాఖ కూడా ఏమీ చేయలేకపోతోంది.

ప్రైవేటు చేతికి

గత ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. నిర్ణీత సమయంలో మాత్రమే విక్రయాలు చేపట్టింది. ఈ వ్యసనం నుంచి ప్రజలను దూరంగా ఉంచేందుకు తీవ్రంగా ప్రయతించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీని ప్రైవేటుపరం చేసింది. దీంతో మద్యం షాపుల సంఖ్యను విపరీతంగా పెంచేసింది. వాటిని దక్కించుకున్న కూటమి నేతలు సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారానికి తెర తీశారు. బెల్టు షాపుల్లో అదనపు ధరలకూ విక్రయించేలా అండగా నిలిచింది.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

కూటమి నేతల అండతో జిల్లాలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మండలాల వారీగా పరిశీలిస్తే సుమారు 1,800 పైగా షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. అంటే అధికారికంగా అనుమతి ఇచ్చిన షాపుల కంటే పదింతలు అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇక్కడ క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తుండగా.. కొందరు అక్కడే సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి, మందు బాబులు తాగేందుకు చోటు కల్పిస్తున్నారు. మరికొందరు కోరిన బ్రాండ్ కావాలని అడిగితే, డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.412.22 కోట్ల మద్యం అమ్మకాలు

జిల్లాలో కేవలం 45 రోజుల్లో మద్యం రూ.412.22 కోట్ల వ్యాపారం జరిగింది. ఇక్కడి దుకాణాలకు గాజుల మండ్యం వద్ద ఉన్న డిపోలో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపోల నుంచి మందు తెచ్చుకుంటున్నారు. కొత్త పాలసీ వచ్చిన అనతికాలంలోనే ఇంత పెద్ద ఎత్తున మద్యం తాగించారంటే.. వ్యాపారం ఏ మేరకు జరిగిందో అర్థమవుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 14 న లాటరీ ద్వారా షాపులు ప్రకటించగా.. అక్టోబర్ 16 నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి.

కక్షగట్టి తొలగించారు

నాయుడుపేట టౌన్: వైఎస్సార్‌సీపీ వారిమని అధికారులపై ఒత్తిడి తెచ్చి తనను రేషన్ షాప్ డీలర్ పదవి నుంచి తొలగించారని గొట్టిప్రోలు రేషన్ డీలర్ శానంపూడి విజయలక్ష్మి వాపోయారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను, తన భర్త వేమాల వెంకటరమణయ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారమన్నారు. కక్ష పూరితంగా తన రేషన్‌షాపు డీలర్ షిప్‌ను తొలగించి అన్యాయం చేశారని వాపోయారు. పొదుపు గ్రూపులో ఉన్న తనకు 2023లో రేషన్ డీలర్‌గా నియమించినట్టు వెల్లడించారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు లేకుండా రేషన్ సరకులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా తన రేషన్ డీలర్ షిప్‌ను అధికారులు తొలగించారన్నారు. గ్రామ వీర్వో వచ్చి తనవద్ద ఉన్న ఈ పాస్ మిషన్ కూడాతీసుకెళ్లారని తెలిపారు. కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం తగదని ఆమె వాపోయింది.

నగరంలో బాంబు బెదిరింపులు

తిరుపతి క్రైం: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజు పార్క్ హోటల్‌లో బాంబులు పెట్టినట్టు ఆదివారం బెదిరింపు కాల్ వచ్చింది. అప్రమత్తమైన అలిపిరి సీఐ రామకిషోర్ బృందం, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీ చేశారు. అయితే హోటల్లో ఎలాంటి బాంబులు లేవని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు నెలలుగా ఇలాంటి బెదిరింపులు పెచ్చుమీరుతుండడం గమనార్హం.

వ్యభిచార గృహం పై దాడి

తిరుపతి క్రైం: నగరంలోని రైల్వే కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈస్ట్ పోలీసులు మెరుపు దాడులు చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు... ఎం అలివేలు మంగమ్మ, శ్రీనివాసులు అనే ఇద్దరు వ్యక్తులు రైల్వే కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్లో ఓ ఇల్లును అద్దెకి తీసుకున్నారు. వీరు కోస్తా, కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మాయిల్ని పిలిపించి వ్యభిచారం చేయించేవారు. సమాచారంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఓ వేశ్యను గుర్తించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్టు వెల్లడించారు.

ముక్కంటి.. కనవేంటి!

- తిరగని బ్యాటరీ వాహనాలు
- ఇబ్బంది పడుతున్న పలువురు భక్తులు
- ఇదే అదునుగా వీల్‌చైర్ నిర్వాహకుల వసూళ్లు


షెడ్డులో బ్యాటరీ వాహనాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్యాటరీ వాహనాలు షెడ్డుకే పరిమితమయ్యాయి. డ్రైవర్లు లేక మూడు రోజులుగా తిరగడం లేదు. దీంతో ముక్కంటి దర్శనానికి విచ్చేసిన వృద్ధ భక్తులు, రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఆలయం వరకు నడిచి వెళ్లలేని వారి కోసం తూర్పు గోపురం, దక్షిణ గోపురం వద్ద బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఇవి చాలామందికి సౌకర్యంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో వాహనాలు నడిపే డ్రైవర్లకు డ్యూటీలు మార్చారు. కొత్తవారిని నియమించకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో పలువురు వృద్ధులు, రోగులు ఆలయం వరకు వెళ్లేందుకు వీల్‌చైర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వీల్ చైర్లు నడిపేవారు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి బ్యాటరీ వాహనాలు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


యోగప్రియ మృతదేహం

రేణిగుంట : మండలంలోని కురకాల్వ పంచాయతీ పద్మనగర్‌లో శనివారం రాత్రి ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. వివరాలు... పద్మనగర్‌కి చెందిన యోగప్రియ(20)కు ఐదేళ్ల క్రితం జి. సెల్వం(29) అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి బాలకృష్ణ(3), మధుశ్రీ(1) అనే పిల్లలు ఉన్నారు. దంపతులు ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి యోగప్రియ తమ ఇంట్లో సీలింగ్‌కు చీరతో ఉరి వేసుకున్నట్లు స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. తహసీల్దార్ సురేష్ బాబు సమక్షంలో సిబ్బంది సాయంతో మృతదేహన్ని కిందకు దించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు.

మెడపై గాయాలు..! : మృతదేహం మెడపై కమిలిన గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి భర్త సెల్వానికి స్థానికంగా ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇటీవల భార్య, భర్తలు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రియురాలితో కలిసి భర్తే ఆమెను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సెల్వం, అతడి ప్రియురాలిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

నాటు తుపాకీ మిస్ ఫైర్

– గిరిజనుడి మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాపూరు: నాటు తుపాకీ మిస్‌ఫైర్ అయ్యి గిరిజనుడు మృతి చెందాడు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, పెనుబర్తి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం.. శనివారం రాత్రి పెనుబర్తి గ్రామానికి చెందిన తాళ్లసుధాకర్(27), శోంటిమణి, శివకుమార్ కలసి గ్రామ సమీపంలోని అటవిలోకి అడవి పందుల వేటకు వెళ్లారు. అక్కడ ఏమిజరిగిందో ఏమోగానీ శోంటిమణి చేతిలో ఉన్న తుపాకీ పేలి సుధాకర్ కణితకు తగిలింది.రక్త స్రావం కావడంతో అతన్ని ఇంటికి తీసుకొచ్చేశారు. ఈ విషయం ఆదివారం గ్రామస్తులకు తెలియడంతో 108 వాహనం ద్వారా రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సుధాకర్ మృతి చెందాడు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ విజయ్‌కృష్ణ, కండలేరు, మర్రిపాడు ఎస్‌ఐలు రామకృష్ణ, శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మణి, శివకుమార్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని పోలీసులు తెలిపారు.

కూల్ డ్రింక్ షాప్ దగ్ధం

వాకాడు : మండలంలోని తూపిలిపాళెంలో షేక్ లతీఫ్ అనే వ్యక్తికి చెందిన కూల్ డ్రింక్ షాపు ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది.బాధితుడు మాట్లాడుతూ ప్రమాదంలో సుమారు రూ.7లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వెల్లడించాడు. ఘటనాస్థలాన్ని ఉప సర్పంచ్ మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


కాలిన సామగ్రి

వేదపండితులకు 'రాహుకేతు' విధులు?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితులకు మళ్లీ రాహుకేతు మండపాల్లో విధులు కేటాయిస్తూ రెండు రోజుల ముందు ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. ముక్కంటి ఆలయానికి కొత్త ఈఓ వచ్చినప్పుడల్లా ఇష్టారాజ్యంగా నిబంధనలు మార్చేస్తుంటారు. గతంలో తీసుకున్న నిర్ణయాలను గాలికి వదిలేసి, తమ ముద్ర వేసేందుకు నూతన విధానాలను తీసుకువస్తుంటారు. ఈ క్రమంలోనే రాహుకేతు పూజల్లో సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరని గతంలో ఈఓగా పనిచేసి ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయాలని హుకుం జారీ చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. స్థానిక భక్తుల విషయంలోనూ ఇదే తరహాలో వివాదం తలెత్తింది. అలాగే ఆజాద్ ఈఓగా ఉన్నప్పుడు వేద పండితులు కేవలం వేద పారాయణం మాత్రమే చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. రాహుకేతు మండపాల్లో విధులు చేయకూడదని పేర్కొన్నారు. ఇప్పుడు ముక్కంటి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన బాపిరెడ్డి మరోసారి పాత పద్ధతులకే శ్రీకారం చుట్టారు. వేద పండితులు సైతం రాహుకేతు పూజలు నిర్వహించవచ్చని ఆదేశించినట్లు తెలిసింది. ఆలయంలోనరి మొత్తం 17మంది వేదపండితులు, అర్చకులు రాహుకేతు పూజలు చేయడానికి అనుమతి లభించినట్లుగా తెలుస్తోంది. వాస్తవానికి రాహుకేతు పూజలు నిర్వహించే డ్యూటీ అంటే సిబ్బంది ఎగిరి గంతేస్తారు. భక్తులు సమర్పించే దక్షిణ కోసం పోటీపడతారు. ఇక్కడ డ్యూటీ కోసం రూ.లక్షలు ముట్టజెప్పేందుకు కూడా వెనుకాడని ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే ఈఓ మారినప్పుడల్లా నిబంధనలు మారడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

441 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం బస్తాలతో అధికారులు

తడ : మండలంలోని చేనిగుంట గ్రామ సమీపంలో ఆదివారం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 441 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ కొండపనాయుడుతో కలిసి జాతీయ రహదారి పక్కన చేనిగుంట గ్రామం సమీపంలో దాడి చేశామన్నారు. 320 బస్తాలు, ప్లాస్టిక్ గోతాముల్లో బియ్యం ఉన్నట్టు తెలిపారు. లారీ డ్రైవర్ శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆ బియ్యాన్ని కొండూరు వద్ద సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించామన్నారు. దాని విలువ రూ.8,31,500 ఉంటుందన్నారు. నాయుడుపేట రైస్ మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. లారీ ఓనర్ మనోహర్, బియ్యం కొనుగోలు చేసిన ప్రతాప్ నాయుడిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

భక్తరంజకంగా 'గీతా'లాపన


శ్లోకం అలపిస్తున్న విద్యార్థిని, పక్కన న్యాయ నిర్ణేతలు

తిరుపతి కల్చరల్ : అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థం పోటీలు భక్తజనరంజకంగా సాగాయి. హిందూధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి వివిధ విద్యాసంస్థల నుంచి 139 మంది విద్యార్థులు హాజరై భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. 6,7 తరగతుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా కె.స్వాతి, కె.భూమి, కె.హహస్త, 8,9 తరగతులకు కె.నందిని, కె.నాగమల్లీశ్వరి, ఎం .వైష్ణవి, 18 ఏళ్లలోపు విద్యార్థుల విభాగంలో కేపీ ముకుంద, జి.జీవన్ శ్రీనివాస్, ఎం.నీరజ వర్ధన్, 18 ఏళ్ల పైబడిన వారిలో లో కేవీ లక్ష్మీదేవి, ఎంఎస్ జ్యోతి, పి.హేమ వెంకటనారాయణ తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఈనెల 11వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

సమానత్వమే అన్నమయ్య ఆకాంక్ష


తిరుమలకు మహా పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

తిరుపతి కల్చరల్: సమాజంలో సాంఘిక సమానత్వమే అన్నమయ్య ఆకాంక్ష అని, ఆ మేరకే ఆయన రచనలు సాగించారని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన వేలాదిమంది భక్తులతో ఆయన తలపెట్టిన తిరుమల మహాపాదయాత్ర ఆదివారం రేణిగుంట- కడప మార్గంలోని కుక్కలదొడ్డికి చేరింది. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ పదకవితాపితామహుడి వారసులుగా భావించే సుమారు 22 ఏళ్లుగా అన్నమయ్య కాలి మార్గంలో తిరుమలకు గోవింద మాలలు ధారణతో వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటున్నామని వెల్లడించారు. అన్నమయ్య తన సంకీర్తనలతో తిరుమల శ్రీవారికి స్వరార్చన చేసి స్వామి వారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. స్వామి దయతోనే సుదీర్ఘ కాలం తిరుమలకు మహా పాదయాత్ర కొనసాగిస్తున్నామని చెప్పారు. తిరుమల శ్రీవారిపై భక్తి నమ్మకమే తమను నడిపిస్తోందని వివరించారు. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి అన్నమయ్య మార్గం అభివృద్ధి చేయాలని డిమాండ్ ఉందని, అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పాలకమండలి తీర్మానం చేసిందని తెలిపారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. అమరనాథ్‌రెడ్డి చేపడుతున్న మహా పాదయాత్ర భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అమరనాథ్‌రెడ్డితో పాటు పాదయాత్రలో భాగస్వామ్యం కావడం మహద్భాగ్యంగా భావిస్తున్నానని తెలిపారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య మార్గం అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆకేపాటి హేమ రాఘవరెడ్డి, సాయి అఖిల్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాసిరి పెంచలయ్య, గాలిశెట్టి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఎర్రమట్టి దొంగలు!


పులివల్లం వద్ద యంత్రంతో మట్టిని తవ్వి టిప్పర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం


పులివల్లం ప్రాంతంలో గ్రావెల్ అక్రమ రవాణాకు యంత్రంతో చేపట్టిన తవ్వకాలు

- పట్టపగలే గ్రావెల్ మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఎర్రమట్టి దోపిడీ కూటమి నేతలకు ధనార్జనగా మారింది. ప్రధానంగా వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో దర్జాగా పగటిపూటే ఎంచక్కా తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా తమిళనాడుకు తరలిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న కూటమి నేతల పేర్లు చెబుతూ తమకెవ్వరూ అడ్డు రాకూడదంటూ దర్జాగా దోపిడీ చేస్తున్నారు. ఇటీవల సత్యవేడు మండలం, రాజులకండ్రిగ వద్ద పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు చేపట్టి వందలాది లారీలలో తమిళనాడుకు తరలించగా ఆరు లారీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు మొక్కుబడి కేసులతో మమ అనిపించారు. తాజాగా నాలుగు రోజుల నుంచి వరదయ్యపాళెం మండలం పులివల్లం నుంచి ప్రభుత్వ భూముల్లో భారీ ఇటాచీలతో టిప్పర్లలో నింపుకుని పట్టపగలే తమిళనాడుకు తరలిస్తున్నారు. అంతా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతోంది. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తమిళనాడులో టిప్పర్ మట్టి రూ. 25వేలు

ఆంధ్ర ఎర్ర మట్టికి తమిళనాడులో మంచి గిరాకీ ఉంది. ఆంధ్ర నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్ లారీ మట్టి రూ.25వేలకు పైగా ధర పలుకుతోంది. దీంతో ప్రభుత్వ భూములు, చెరువులను అక్రమ రవాణాకు అడ్డాగా మార్చుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు.